క్లుప్తంగా

గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం రేపు

రంపచోడవరం: మండలంలోని గోపవరం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలన్నారు.

సీపీఎం నాయకుల ఆందోళన

రాజవొమ్మంగి: మండలంలోని డి.మల్లవరం గ్రామంలో సీపీఎం నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. నాయకులు ప్రవీణ్, దొరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగరాజు, చినరాజుబాబు, స్థానికులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

పెదబయలు: ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల్లోని ఏకలవ్య మోడల్ రెడిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాళ్లు పి.కేశవరావు, ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి 60 సీట్లకు గాను 30 సీట్లు బాలురు.30 సీట్లు బాలికలు ఉంటారని అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీలున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 15 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాలల్లో సంప్రదించాలని కోరారు.

గర్భిణులకు పాలు, గుడ్లు పంపిణీ



కంద్రుంలో గర్భిణులకు పాలు, గుడ్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు.

ప్రహరీ నిర్మించరూ..



జూనియర్ కళాశాల వద్ద కిత్తనార మట్టలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న కంచె

అనంతగిరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో కళాశాల వద్ద నాటిన మొక్కలు సైతం పశువులపాలవుతున్నాయి. త్వరలో ఇంటర్ పరీక్షలు జరుగుతుండడంతో తాత్కాలికంగా కిత్తనార మట్టలతో కళాశాలకు ప్రహరీగా కంచెను ఏర్పాటుచేసుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ నిర్మాణానికి కృషి చేయాలని, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ వద్ద ఉన్న అభివృద్ధి తదితర పనుల వివరాలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఆ రోజు ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు అందరికీ సమాచారం ఇచ్చినట్టు పేర్కొన్నారు.

సజావుగా సరఫరా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా గుడ్లు పంపిణీ
- చెరగడానికి వీలు లేని విధంగా ముద్ర
- పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు అందజేత



పంపిణీకి సిద్ధమైన స్టాంపింగ్ ఉన్న రంగుల గుడ్లు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు, బాలింతలు

జిల్లాలో ఐసీడీఎస్ వివరాలు	
ఐసీడీఎస్ ప్రాజెక్టు	25
మండలాలు	22
అంగన్‌వాడీ కేంద్రాలు	1122
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	1146
గర్భిణీలు	7,939
బాలింతలు	8,846
3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు	36,689
7 నెలల నుంచి 3 సంవత్సరాలు పిల్లలు	39,347

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద కోడిగుడ్లు సరఫరా చేసే కార్యక్రమం సజావుగా సాగుతోంది. స్టాంపింగ్ విధానంతో అవినీతికి తావులేకుండా గుడ్లు పక్కాదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరుతున్నాయి. అంగన్‌వాడీ సరకులు పక్కదారి పట్టకుండా చెక్ పెడుతూ ప్రభుత్వం స్టాంపింగ్ విధానం తీసుకురావడంతో సత్ఫలితాలనిస్తోంది.

ఇదీ సంగతి

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలు ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు, 3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రతి నెల 25 గుడ్లను వైఎస్సార్ సంపూర్ణపోషణ ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు ప్రతి 15 రోజులకోసారి ఇంటికి గుడ్లు అందిస్తున్నారు. మిగిలిన వారికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉడకబెట్టి పంపిణీ చేస్తున్నారు. వీటిలో నాలుగు నుంచి ఆరుశాతం దారి మళ్లడం. పాడైపోవడం జరుగుతుండేవి. దీన్ని నివారించేందుకు నెలకు మూడుభాగాలు విభజించి, మొదటి పదిరోజులు సరఫరా గుడ్లు ఒక రంగు, తర్వాత పదిరోజులు మరో రంగు, మిగిలిన పదిరోజులు వేరే రంగు చుక్కలు పెట్టి పంపిణీ చేసేది. అయితే అక్రమార్కులు గుర్తులను తుడిచేసి పక్కదారి పట్టించేవారు. దీన్ని నివారణకు ప్రభుత్వం సరికొత్తగా కలర్ కోడింగ్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది.

బ్లూ, పింక్, గ్రీన్(బీపీజీ) గుడ్లు సరఫరా ఆరంభించింది. మొదటి పదిరోజులు బ్లూ కలర్ కోడింగ్, తరువాత 10 రోజులు పింక్, మిగిలిన 10 రోజులు ఆకుపచ్చ రంగులో కోడింగ్‌తో గుడ్లు అందిస్తున్నారు. కలర్ కోడింగ్ వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లు బయట అమ్మేందుకు అవకాశం లేదు. ఒకవేళ అమ్మిన అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా జరిగిన గుడ్లుగా గుర్తించవచ్చు. ఫలితంగా చిన్నారులు, బాలింతలకు సంపూర్ణ పోషణ పోషకాహారం అందించాలన్నాదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం.

స్టాంపింగ్‌తో సత్ఫలితాలు

ఈ పరిస్థితులను పూర్తిస్థాయిలో చక్కదిద్దే లక్ష్యంతో గుర్తు చెరిగిపోని విధంగా కోడిగుడ్డుపై స్టాంప్‌చేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అల్లూరి జిల్లాలోని అమలుచేస్తున్న ఈ విధానం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలే ఇస్తోందని, అధికార యంత్రాంగాలు గుర్తించాయి. తాజాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో చెరగని ఓ స్టాంపును గుడ్డుపై ముద్రిస్తుంది. ఫలితంగా మార్కెట్‌లో అంగన్‌వాడీ గుడ్లు దొడ్డిదారి పట్టకుండా పక్కాగా అడ్డుకట్ట వేసింది.

అక్రమాలకు ఆస్కారం లేదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి లబ్ధిదారుకూ గుడ్డు అందించాలని ఆదేశించాం. ప్రతి పది రోజులకు ఒక రంగుతో కూడిన గుడ్డును సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ముద్రతో గుడ్డు సరఫరా చేయడం వల్ల అక్రమాలకు ఆస్కారం లేదు. అలాగే ప్రతి పదిరోజులకు అందించే గుడ్లపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సంతోషికుమారి, సీడీపీవో, అనంతగిరి

భీమలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదబయలు: మండల కేంద్రంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, శిఖర పూజ, గోత్ర నామాలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందించారు. జాతరను పురస్కరించుకొని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి పోస్టాఫీసు రోడ్డు వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్, జీవన్‌కుమార్, ఎంఈవో సింహాచలం, సూరయ్య, లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు

వినికిడి యంత్రం అందజేత



వినికిడి యంత్రం అందిస్తున్న మహేష్

కొయ్యూరు: రేవళ్లకు చెందిన కొమ్మోజీ కామేశ్వరరావుకు జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ గురువారం వినికిడి యంత్రాన్ని శరభన్నపాలెంలో అందజేశారు. ఇటీవల ఎంపీ మాధవిని కలిసిన కామేశ్వరరావు తన వినికిడి సమస్యను విన్నవించి, ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మాధవి అతనికి యంత్రాన్ని అందజేయాలని సోదరుడు మహేశ్‌కు చెప్పారు. దీంతో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి కుటుంబ సభ్యులకు కామేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెదబయలు: మండలంలోని పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ఆదివాసీ సంఘం నాయకులు తదితరులు గురువారం పర్యటించారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాకినాడ ఆయిల్ కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను వారు పరామర్శించారు. గ్రామంలో నిర్వహించిన మృతుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా బాధిత కుటుంబాలకు రూ.10వేలను అందజేశారు. రామునాయుడు, సింహాద్రి, జోగారావు, శేషగిరిరావు, వెంకటేశ్వర్లు, కొండయ్య పాల్గొన్నారు.

కించూరులో తాగునీటి సమస్య పరిష్కారం



కించూరులో నిర్మిస్తున్న బోరు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, పాడేరు: పంచాయతీ కేంద్రం కించూరులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కించూరులో తాగునీటి ఇబ్బందిపై ఫిబ్రవరి 7న 'సాక్షి'లో ప్రచురితమైన 'తాగునీటి సమస్యతో సతమతం' వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికార యంత్రాంగం జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.20లక్షలతో తాగునీటి పథకాన్ని కించూరుకు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయడంతో తాగునీటి పథకం నిర్మాణ పనులను సంబంధిత టెండర్‌దారుడు ప్రారంభించాడు. ఈ మేరకు కించూరులో సర్పంచ్ వంతాల రాంబాబు, ఇతర పెద్దల సమక్షంలో బోరుబావిని తవ్వారు. పుష్కలంగా నీరందంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ట్యాంకుతో పాటు, ఇంటింటికీ కుళాయిల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, గిరిజనులకు సురక్షిత తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ పాడేరు డీఈఈ ప్రకాష్ 'సాక్షి'కి తెలిపారు.

క్షయ నివారణకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు

రంపచోడవరం: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముసురుమిల్లి, తామరపల్లి సర్పంచ్‌లు రమేష్‌బాబు, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి.సుబ్బారాజు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో పనిచేసేందుకు సహకరించాలని, క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని తమ వలంటీర్లు పరీక్షలకు తీసుకెళ్తారన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి క్షయ నిర్మూలన కోసం పని చేస్తామన్నారు. సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం స్థాపనకు అందరూ కృషి చేయాలని కోరారు. కేవలం చైతన్యంతోనే క్షయను నిర్మూలించవచ్చన్నారు. స్టాప్ టీబీ పార్టనర్‌షిప్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొండరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన గిరిజనుడికి పరామర్శ



గాయపడిన గిరిజనుడిని పరామర్శిస్తున్న కించూరు సర్పంచ్ రాంబాబు

పాడేరు రూరల్ : మండలంలోని కించూరు పంచాయతీ బర్లపుట్టు గ్రామానికి చెందిన గెమ్మెలి మల్లి అనే గిరిజనుడు గురువారం ఉదయం తన కాఫీ తోటల పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు కల్పిస్తున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ వంతాల రాంబాబు పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న గిరిజనుడిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

రోలుగుంట: స్థానిక కొండపైన వేంకటేశ్వర ఆలయంలో వెంకన్న కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కల్యాణకర్త ముత్యాల పెద్దియ్య కుటుంబీకులు ఆచార సంప్రదాయబద్ధంగా పెండ్లిరాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకూ జరిగే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

రాజవొమ్మంగి: యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పైడిమల్లు, రమణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక విల్సన్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఉపాధ్యక్షుడిగా పి.వి. సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడిగా మిరియాల సత్యవతి, కోశాధికారిగా కాజెం శ్రీను, ఎఫ్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా బూడి శ్రీనుబాబు తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా అమ్మవారి అనుపు మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనుబాబు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు

రోలుగుంట: కుసుర్లపూడిలో శుక్రవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు పెద్దింటమ్మతల్లి ఉత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన గోడ పత్రికను గురువారం వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దు అప్పలనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. ముగింపు రోజు రాత్రి నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యం



కుజ్జెలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు



జి.మాడుగులలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరావు, నేతలు



సూకురులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు



జీకే వీధిలో ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి



అనంతగిరిలో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి



డుంబ్రిగుడలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ ఈశ్వరి, నాయకులు



ముంచంగిపుట్టులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సీతమ్మ, నాయకులు

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల మండల పరిశీలకులు సతక బుల్లిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని కుజ్జెలి, వంతాడపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమావేశాలు ర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ అనుబంధ పంచాయతీ రాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, వ్యవసాయ మర్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, ఎంపీటీసీ నర్సింహమూర్తి, సర్పంచ్ రాజులమ్మ, నాయకులు కొట్టగుళ్లి నాగేంద్ర, కన్నాపాత్రుడు, కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గెమ్మెలి, వంజరి గ్రామాల్లోని పాఠశాలలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నియోజవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు సందర్శించారు.ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం మండల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సుధాకర్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ నాగూరుబాబు, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఎం.విజయకుమారి, జి.సన్యాసిదొర పాల్గొన్నారు.

హుకుంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. మండలంలోని చట్రాయిపుట్టు, సూకురు, బిరిసింగి, రామచంద్రపురం, భీమవరం, చిట్టంపాడు, బాకురు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యుడు ఎం.వివేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షుడు చిన సత్యం, సర్పంచ్‌లు సత్యవతి, శ్యామ్ సుందర్, సాంబ, ఈశ్వరమ్మ, చిన్నారావు, ఎంపీటీసీ భీమలింగ్వేశ్వరరావు, యువజన విభాగ ప్రధాన కార్యదర్శి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి రమాప్రభ ప్రచారం నిర్వహించారు. కృష్ణారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/కొయ్యూరు/గూడెం కొత్తవీధి: అనంతగిరి మండల కేంద్రంలోని కొత్తవలస, బాలికల-1 సచివాలయాన్ని ఎంపీపీ శెట్టి నీలవేణి గురువారం సందర్శించారు. డుంబ్రిగుడ మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ బూసిపుట్టు, మొనిగుడ, కోల్లాపుట్టు, చంపగుడ తదితర గ్రామాల్లో ఎంపీపీ బాక ఈశ్వరి పర్యటించారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఎంపీపీ సీతమ్మ ప్రచారం నిర్వహించారు. వారు ఆయా మండలాల్లో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అనంతగిరిలో కో-ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, సర్పంచ్ రామ్మూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలోని డౌనూరు ఆశ్రమ పాఠశాల, ఆస్పత్రి, డౌనూరు సచివాలయం, మర్రిపాలెం మహిళా డిగ్రీ కాలేజీల్లో ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జి.రాజులమ్మ, మండల కన్వీనర్ సుధాకర్ తదితరులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గూడెంకొత్తవీధిలో బాలికల ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాల, కేజీబీవీ, బాలికల గురుకుల కళాశాలలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పాల్గొన్నారు. వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు కె.రామకృష్ణ, పి.కృష్ణారావు, వి.అరుణ్, ఎంపీటీసీలు నాగమణి, పి.కృష్ణమూర్తి, భీమరాజు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ వి.ప్రసాద్, పి.త్రిమూర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ ఎరమయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చోడవరం/రూరల్: మైచర్లపాలెంలో అభ యాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయుని భక్తులు, భజన గురువులు, గ్రామ సర్పంచ్ బూరె మాణిక్యం ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పురుషసూక్తం విధానంలో స్వామివారికి పంచామృతాలు, అప్పాలు, గారెలు, తమలపాకులు, సింధూరాలను సమర్పించి అభిషేకాలు జరిపారు.

కనులపండువగా వేంకటేశుని వార్షిక కల్యాణోత్సవం

కోటవురట్ల: మండలంలోని నరసింగబిల్లిలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం శుక్లపక్ష ఏకాదశి పురస్కరించుకుని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూలమాలలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి, వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. మల్లపురెడ్డి కోటేశ్వరరావు, లీలావతి దంపతులు, మారిశెట్టి రాజాసతీష్, సుజాత దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని ఆద్యంతం భక్తిశ్రద్ధలతో తిలకించి తన్మయత్వం చెందారు. సర్పంచ్‌లు అరుణ, రాము, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.